
## నిధుల్లేక నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్



2



2

## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు..



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## రేపు బాస్కెట్‌బాల్ సబ్ జూనియర్ క్రీడాకారుల ఎంపికలు

**అక్షరటుడే, ఇందూరు :** బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించనున్నారు. ఈనెల 10న జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ మైదానంలో ఉదయం 11:30కు ఉంటాయని సంఘం అధ్యక్ష కార్యదర్శులు విజయ్ కుమార్, బొబ్బిలి నరేష్ తెలిపారు. 2012 జనవరి 1 తర్వాత జన్మించినవారు అర్హులన్నారు. క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు ఆర్గనైజింగ్ సెక్రెటరీ నిఖిల్ 9160036040ను సంప్రదించాలన్నారు.





## శ్రీరామ్‌సాగర్‌కు కొనసాగుతున్న వరద.. 8 గేట్ల ఎత్తివేత

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయని శ్రీరామ్‌సాగర్‌కు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. దీంతో అధికారులు 8 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌లోకి 54,545 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్ట్ నిండుకుండలా మారింది. దీంతో అధికారులు ఎనిమిది వరద గేట్లు ఎత్తి 25 వేల క్యూసెక్కులు గోదావరి లోకి వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా.. ప్రస్తుతం అంతే మొత్తంలో నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి 19 వేల క్యూసెక్కులు వరద కాలువ కు విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువకు 5,500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,500, సరస్వతి కాలువకు 800, లక్ష్మి కాలువకు 360 క్యూసెక్యుల నీటిని వదులుతున్నారు. అలీసాగర్ ఎత్తిపోతలకు 360, గుత్ప ఎత్తిపోతలకు 270, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తం 54,545 క్యూసెక్కుల ఔట్ ఫ్లో నమోదు అవుతోంది.

## పోలీస్ ఇమేజ్ పెంచేలా విధులు నిర్వర్తించాలి : సీపీ సాయిచైతన్య



**అక్షరటుడే, బోధన్:** కమిషనరేట్ పరిధిలో పోలీస్ ఇమేజ్‌ను పెంచేవిధంగా విధులు నిర్వర్తించాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. బోధన్ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ముందుగా ఆయన సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సిబ్బంది యూనిఫాం టర్న్ అవుట్, కిట్ ఆర్టికల్స్‌ను చెక్ చేశారు. స్టేషన్‌లో కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలు జరుగుతున్నాయని.. సైబర్ క్రైం గురించి స్థానిక పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిచాలని సూచించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ మహారాష్ట్రకు దగ్గరగా ఉన్నందున పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. యువత బెట్టింగ్ యాప్స్ జోలికి వెళ్లకుండా వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతికేసులో ఖచ్చితమైన విచారణ చేసిన తర్వాతే చర్యలు తీసుకోవాలని ఎస్సైలకు సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో విలేజ్ ఆఫీసర్లుగా పనిచేసే సిబ్బంది ప్రజలతో మమేకమై గ్రామాల్లో సమస్యలను తమ శక్తిమేర పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ విజయ్ బాబు, బోధన్ ఎస్‌హెచ్‌వో వెంకట నారాయణ, బోధన్ ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, బోధన్ రూరల్ ఎస్సై జె. మచ్చేందర్, ఎడపల్లి ఎస్సై రమ, రెంజల్ ఎస్సై చంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని నిజామాబాద్ కమిషనరేట్ పోలీసులు హెచ్చరించిన విషయం తెలిసిందే. ప్రత్యేకించి పలువురు వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు జరిపిన విషయం విధితమే. సోదాల్లో పెద్ద ఎత్తున నగదు, అప్పు తాలుకు పత్రాలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత సంబంధిత పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. అయితే బడా వడ్డీ వ్యాపారుల పట్ల పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

- అక్షరటుడే, నిజామాబాద్



# బడా వడ్డీ వ్యాపారులపై చర్యలేవి?

▸ రూ.కోట్లలో దందా చేస్తున్న పలువురు ▸ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకొని అప్పులు ▸ చూసిచూడనట్లు వదిలేస్తున్న పోలీసులు

నిజామాబాద్ నగరం కేంద్రంగా పలువురు రూ.కోట్లలో వడ్డీ దందా నిర్వహిస్తున్నారు. నెలకు 3 నుంచి 5 శాతం వడ్డీ తీసుకోవడమే కాకుండా.. ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఆయా వ్యాపారులకు ఎలాంటి అనుమతులు లేవు. చిట్‌ఫండ్ ముసుగులో దర్జాగా ఫైనాన్స్ దందా సాగిస్తున్నారు. ఉదాహరణకు నగరంలోని ప్రముఖ స్టార్ హోటల్, షాపింగ్ మాల్ యజమాని రూ.కోట్లలో వడ్డీ దందా నిర్వహిస్తున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పొలిటికల్ లీడర్లకు ఈ వ్యాపారి పెద్ద ఎత్తున అప్పులుగా ఇచ్చాడు. ఆస్తి తాలుకా పత్రాలు నేరుగా తనతో పాటు తన బినామీల పేరిట రిజిస్ట్రేషన్ చేసుకొని రూ.కోట్లలో వడ్డీ దందా చేస్తున్నాడు. అయినా పోలీసులు సదరు వ్యాపారిపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కమిషనరేట్‌లో ఇప్పటి వరకు రెండు దఫాలుగా సోదాలు నిర్వహించినప్పటికీ.. ఆ జాబితాలో వ్యాపారి పేరు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

### కేసులు నమోదైనా..

ఓ కూల్‌డ్రింక్స్ డీలర్ యజమాని, రియల్ ఎస్టేట్ వ్యాపారి కూడా పెద్ద మొత్తంలో వడ్డీ దందా నడుపుతున్నారు. వైద్యుడు, మరో ఇద్దరితో కలిసి సదరు వ్యాపారి గతంలో ఓ వెంచర్ నిర్వాహకులకు రూ.కోట్లను వడ్డీ కింద ఇచ్చాడు. ఈ వ్యవహారం వివాదంగా మారి పోలీసు కేసులు నమోదయ్యాయి. ఇప్పటికీ ఈ వడ్డీ వ్యాపారి మార్కెట్‌లో తన దందాను దర్జాగా సాగిస్తున్నాడు. అయినా ఇతగాడిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు వెనుకడుగు వేస్తున్నారు.

ఓ పార్టీకి చెందిన నేత సైతం పెద్ద మొత్తంలో వడ్డీ దందా నిర్వహిస్తున్నాడు. తన బినామీల పేరిట ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించుకొని మార్కెట్‌లో వడ్డీ దందా కొనసాగిస్తున్నాడు. ఈ విషయం పోలీసులకు తెలిసినా తనిఖీలు చేసేందుకు వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. ఓ పక్కా వడ్డీ దందా పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెబుతున్న పోలీసులు మరోపక్కా బడా వ్యాపారులపై చర్యలు తీసుకోకుండా వదిలేయడం గమనార్హం.

## ప్రతి రైతును ఆదుకుంటాం..



**అక్షరటుడే, లింగంపేట:** గత నెలలో కురిసిన భారీ వర్షానికి ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తీవ్ర నష్టం వాటిల్లిందని.. బాధిత రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు హామీ ఇచ్చారు. లింగంపేట మండలంలోని పోతాయపల్లి, కోమటిపల్లి, కన్నాపూర్, పోల్కంపేట గ్రామాల్లో వర్ష బీభత్సానికి నష్టపోయిన పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలో జరిగిన నష్టాన్ని సీఎం రేవంత్ రెడ్డికి నివేదించానని ప్రతి రైతుకు న్యాయం జరిగే విధంగా చూస్తానని చెప్పారు. చెరువు కట్టలు, రోడ్ల మరమ్మతుల పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వస్తువులు కల్పించాలని సూచించారు. లింగంపేట రైతువేదికలో అంగన్‌వాడీ టీచర్లకు నూతన యూనిఫాంలను అందజేశారు. ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, ఎంపీడీవో నరేష్, ఏవో అనిల్ కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్రనారా గౌడ్, సంతోష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బైరయ్య, ఎల్లమయ్య, నాగరాజు పాల్గొన్నారు.

## వరద సాయం అందించి కామారెడ్డిని ఆదుకోండి



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మంగళవారం కలిశారు. వరద నష్టంపై ఆయనకు వివరించారు. కామారెడ్డిలో సంభవించిన విపత్తు, జరిగిన నష్టాన్ని కేంద్ర మంత్రులకు ఆయన వివరిస్తున్నారు. సోమవారం కేంద్ర మంత్రులు రూపాల, కిషన్ రెడ్డిలను కలిసిన ఎమ్మెల్యే మంగళవారం నితిన్ గడ్కరీని కలిశారు. నియోజకవర్గంలో వరదలతో దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు దారుణంగా ఉన్నాయని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని కోరారు. కామారెడ్డిలో వాహనాల రద్దీ పెరిగిందన్నారు. కామారెడ్డికి రింగు రోడ్డు కావాలని వాటి ప్లాన్, మ్యాప్‌లు, డీపీఆర్ అంచనా వ్యయం చేయించి కేంద్ర మంత్రికి వివరించారు. సుమారు రూ.510 కోట్లతో 54 కిలోమీటర్ల పొడవు ఉన్న ఔటర్ రింగు రోడ్డు కామారెడ్డి పట్టణం చుట్టూరా అవసరం ఉందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



## ఘనంగా ప్రజాకవి కాళోజీ జయంతి

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాళోజీ నారాయణ రావు అందించిన సేవలను వక్తలు కొనియాడారు. అంతకుముందు వర్ని చౌరస్తాలో ఉన్న కాళోజీ విగ్రహానికి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు షాక్.. పార్టీకి సొసైటీ చైర్మన్ రాజీనామా



**అక్షరటుడే, బోధన్:** బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. ఇటీవల పార్టీ నుంచి ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేయడంతో ఆమె అనుచరులు పార్టీని వీడుతున్నారు. బోధన్ నియోజకవర్గం నవీపేట్ మండలంలోని నాళేశ్వర్ గ్రామానికి చెందిన సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆ లేఖను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పంపారు. ఈ సందర్భంగా మగ్గరి హన్మాండ్లు మాట్లాడుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వెంటే తాను ఉంటానని ఆయన పేర్కొన్నారు. కొన్నిరోజుల క్రితం బీఆర్ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేయడంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కవితను అన్యాయంగా బీఆర్ఎస్ నుంచి తొలగించారని.. అందుకే కవిత వెంటే ఉండేందుకు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పినట్లు తెలిపారు. కాగా కాళేశ్వరం అవినీతిలో హరీశ్ రావు, సంతోష్‌రావు పాత్ర ఉందని కవిత ఆరోపించిన విషయం తెలిసిందే. దీంతో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అనంతరం ఆమె పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో జిల్లాలోని ఆమె అనుచరులు బీఆర్ఎస్‌ను వీడుతున్నారు.

## ఏడో బెటాలియన్‌లో ఉచిత హెల్త్ క్యాంప్

**అక్షరటుడే, డిచ్‌పల్లి :** మండలంలోని తెలంగాణ ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్‌లో మంగళవారం హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. కమాండెంట్ సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా జనరల్ ఆస్పత్రి, డీఎంహెచ్‌వో రాజశ్రీ పర్యవేక్షణలో పీఎం టీబీ ముక్త్ అభియాన్‌లో భాగంగా క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెండు రోజులు పాటు బెటాలియన్‌లో సిబ్బందికి వైద్య పరీక్షలు చేయనున్నారు. ఇందులో పలు రకాల ఆరోగ్య పరీక్షలు, ఛాతి సంబంధిత పరీక్షలు, టీబీ, హెచ్‌ఐవీ టెస్ట్, హెపటైటిస్ బీ, వీడీఆర్ఎస్, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్హహిస్తున్నామని వైద్య సిబ్బంది తెలిపారు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది, కుటుంబసభ్యులు ఈ సేవలను సద్వినియోగం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ శరత్ కుమార్, యూనిట్ మెడికల్ ఆఫీసర్ శ్రీయాన్, అనుపమ, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.





## వెల్లూరు సీఎంసీని సందర్శించిన ఎమ్మెల్యే

**అక్షరటుడే, బాన్సువాడ :** తమిళనాడులోని ప్రసిద్ధ వెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజీని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మంగళవారం సందర్శించారు. 125 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ సంస్థ దేశంలోని అత్యంత విశ్వసనీయ వైద్య సేవా కేంద్రం గా పేరుగాంచిందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. సాధారణ చికిత్సల నుంచి అత్యాధునిక శస్త్రచికిత్సల వరకు విస్తృతమైన వైద్య సదుపాయాలను ఆయన పరిశీలించారు. నర్సింగ్, ఎంబీబీఎస్, పీజీ, సూపర్ స్పెషాలిటీ కోర్సులు, ఆధునిక పరిశోధనలు, ప్రజారోగ్య శిబిరాలు నిర్వహించడం సీఎంసీ ప్రత్యేకత అని అక్కడి వైద్యులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా వైద్య బృందాన్ని కలుసుకుని వారు అందిస్తున్న ప్రజా సేవలను అభినందించారు. జుక్కల్ నియోజకవర్గంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన అభ్యర్థన మేరకు సీఎంసీ వైద్య బృందం త్వరలో జుక్కల్ నియోజకవర్గంలో పర్యటించి ప్రజలకు వైద్య సేవలు అందించడానికి సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిపారు.


## జానకంపేట లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సీపీ పూజలు



**అక్షరటుడే, బోధన్:** జానకంపేట లక్ష్మీనృసింహస్వామిని సీపీ సాయిచైతన్య మంగళవారం దర్శించుకున్నారు. ఈ మేరకు ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను పూజారులు సీపీకి వివరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీపీతో పాటు రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎడపల్లి ఎస్సై రమ్య తదితరులు ఉన్నారు.




## రిటైర్డ్ ఎస్సై కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**అక్షరటుడే, కామారెడ్డి:** రామారెడ్డి మండలం రెడ్డిపేట స్కూల్ తండాకు చెందిన రిటైర్డ్ ఎస్సై పెంటయ్య మాతృమూర్తి సక్రిబాయి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మంగళవారం పెంటయ్య ఇంటికి వెళ్లారు. సక్రిబాయి చిత్ర పటానికి నివాళులర్పించి పెంటయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. కాగా పెంటయ్య కామారెడ్డి పట్టణ ఎస్సైగా పనిచేసి రిటైర్ అయ్యారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు సలావత్ బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపి దశరథ్ రెడ్డి, రాంరెడ్డి, రాజేందర్, హన్మాండ్లు, మురళి, మాజీ సర్పంచ్ రాజు, నంద కిషోర్, నంద రమేష్ తదితరులు ఉన్నారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ మండలం హన్మాజిపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సిబ్బంది విధి నిర్వహణ, రికార్డుల నిర్వహణ, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని, రోగుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా వైద్యసేవలు అందించాలని సూచించారు. అలాగే ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

## జేసీ వీక్ వారోత్సవాలు ప్రారంభం




**అక్షరటుడే, ఇందూరు:** జేసీ వీక్ వారోత్సవాలు ఈనెల 9 నుంచి 15 వరకు నిర్వహించనున్నట్లు జేసీఐ సిల్వర్ జూబ్లీ అధ్యక్షుడు జేసీ పెందోటి గౌతమి, జేసీ వీక్ ఛైర్మన్ కర్క రమేష్ తెలిపారు. మంగళవారం జేసీ వీక్ వారోత్సవాల ప్రారంభం సందర్భంగా మొదటి రోజు జెండా ఆవిష్కరణ, (ఫ్లాగ్ హోస్టింగ్), అలాగే ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. రెండో రోజు ఎంపవర్‌పై శిక్షణ, మూడో రోజు గేమ్స్ అండ్ స్పోర్ట్స్, వెల్నెస్ డే, నాలుగో రోజు బోర్డు రూం బీట్స్, ఐదో రోజు వాయిస్ ఆఫ్ డ్యూటీ, హ్యూమన్ డ్యూటీ, ఆరో రోజు గ్లోబల్ రికార్డ్ చాలెంజ్, బిగ్గెస్ట్ యూత్ ఇన్విటేషన్ డ్రైవ్, ఏడో రోజు ముగింపు కార్యక్రమం సెలబ్రేషన్ డే ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు శ్రీహరి, చంద్రశేఖర్, యాదేశ్, సెక్రెటరీ జైపాల్ కాలే, శేఖర్ పాల్గొన్నారు.

## కోట దుర్గమ్మ ఆలయ కమిటీ నూతన కార్యవర్గం



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని కోట దుర్గమ్మ ఆలయ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పద్మ నరేష్, గౌరవ అధ్య క్షుడిగా చిదుర శివకుమార్, ఉపాధ్యక్షుడిగా బుడాల సాయిలు, కార్యదర్శిగా దాసరి బాలకృష్ణ, జాయింట్ సెక్రెటరీగా శ్రావణ్ కుమార్, కోశాధికారిగా పత్తి మహేందర్, సహాయ కోశాధికారిగా నవీన్ ఎన్నికయ్యారు. మాజీ గౌరవ అధ్యక్షుడు పత్తి శ్రీకాంత్, గంగాధర్, రాజా, ఉప్పరి లింగం పాల్గొన్నారు.





## నిధుల్లేక నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

**నగరంలోని బోధన్ రోడ్‌లో నాన్‌వెజ్ మార్కెట్, ఖలీల్‌వాడిలోని పాత డీఈవో ఆఫీస్ ఎదురుగా వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. నిధుల్లేక ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి. దీంతో ఈ భవనాలు అసాంఘిక కార్యకలాపాలను అడ్డాగా మారాయి. వీటిపై ప్రస్తుత ప్రభుత్వం, అధికారులు దృష్టిసారించి వెంటనే పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్**



## 14న పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**అక్షరటుడే, భిక్కనూరు:** మండలంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1989-90 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు న్యాయవాది అతిమాముల శ్రీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రకటన విడుదల చేశారు. 14వ తేదీ ఆదివారం ఉదయం పెద్ద మల్లారెడ్డిలోని శ్రీ వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నామని 1989-90 బ్యాచ్ విద్యార్థులు తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు. ఆనాడు తమకు విద్యాబుద్ధులు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించనున్నామని వివరించారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితుల మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందంగా గడిపేందుకు పూర్వ విద్యార్థులు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరు కావాలని నిర్వహణ కమిటీ తరపున ఆయన కోరారు.


ఆర్మూర్‌లో..


బిచ్కుంద మండలంలో..


బాన్సువాడలో..

## కాళోజీకి ఘన నివాళి

**ఉమ్మడిజిల్లాలో కాళోజీ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నిజాంకు వ్యతిరేకంగా కవితలు రాసి ప్రజలను మేల్కొల్పిన వీరుడు కాళోజీ అని వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ బతుకుకు వన్నెతెచ్చిన కవి కాళోజీ అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్**


ఎల్లారెడ్డిలో..

## లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డుల అందజేత

**అక్షరటుడే, బాల్కొండ :** బాల్కొండ మండలానికి కొత్తగా 2,258 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా బాల్కొండ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు మంగళవారం రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, నాయకులు యూనుస్, కుంట సంతోష్ గౌడ్, కుందరం శ్రీనివాస్, గోపు ఊషన్న, విద్యాసాగర్, ధోన్‌పాల్ సాయన్న, పురుషోత్తం, షేరు, నవీన్ కుమార్, దయాకర్, వినేష్ కుమార్, పిప్పెర అశోక్, మజార్, మెట్టు అశోక్, గోపు చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



## బాల్కొండలో ఉచిత కంటి వైద్య శిబిరం



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని కిసాన్ నగర్ లయన్స్ భవనంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, ఆర్మూర్ లయన్స్ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ లయన్స్ ఆస్పత్రి వైద్యాధికారి పుణ్యరాజు సుమారు 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో మోతిబిందు సమస్య ఉన్నవారిని గుర్తించి, తక్షణమే శస్త్రచికిత్స కోసం ఆర్మూర్ లయన్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. దీంతో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు మంచి వైద్య సేవలు అందేలా ప్రయత్నించినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్లు చాకు లింగం, జీవన్, జోనల్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దినేష్ పటేల్, కోశాధికారి వంశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు.. ఒకరి దుర్మరణం

**అక్షరటుడే, ఇందల్వాయి:** జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నాలుగైదు రోజుల క్రితం శ్రీరాంసాగర్ వద్ద హైవేపై వెళ్తున్న బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందగా.. ఇద్దరు గాయపడ్డారు. తాజాగా.. ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో కారు ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని దేవీ తండా పెట్రోల్ బంక్ ఎదురుగా 44వ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న కారు పెట్రోల్ బంకు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న వారిలో నర్సింహా రెడ్డి అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి విశాల్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నిజామాబాద్‌కు తరలించారు. కాగా.. వీరు హైదరాబాద్ నుంచి ఇచ్చోడ వెళ్తున్నట్లు తెలిసింది.

## డ్రంకన్ డ్రైవ్‌లో కేసులో నలుగురికి జైలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మద్యం తాగి వాహనం నడిపిన నలుగురికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా.. సుమారు 14మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లు గుర్తించారు. అనంతరం వారిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చారు. విచారించిన న్యాయమూర్తి నలుగురిలో ఇద్దరికి రెండురోజుల జైలు శిక్ష, మరో ఇద్దరికి నాలుగురోజుల జైలు విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే మరో 10మందికి రూ.12,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

## పోలీస్ స్టేషన్‌కు లైటింగ్ బోర్డు బహూకరణ




**అక్షరటుడే, లింగంపేట:** లింగంపేట పోలీస్ స్టేషన్‌కు మండల కేంద్రానికి చెందిన సార్వజనిక్ గణేశ్ మండలి సభ్యులు లైటింగ్ బోర్డును బహూకరించారు. సభ్యులు మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారికి బోర్డు కనిపించడకపోవడంతో తాము ఈ ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గణేశ్ మండలి సభ్యులను ఎస్సై దీపక్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సార్వజనిక్ గణేశ్ మండలి సభ్యులు చేపూరి వంశీ, సురేష్, బబ్లు, వేణు పాల్గొన్నారు.

## అదుపు తప్పిన టిప్పర్.. తప్పిన భారీ ప్రమాదం



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండలంలోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బీబీపూర్ తండా వద్ద డిచ్‌పల్లి వైపు వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి ఒక్కసారిగా రోడ్డుపక్కకు దూసుకుపోయింది. అతివేగంగా సైడ్‌వాల్‌ను ఢీకొట్టడంతో అది ఓవైపు వంగిపోయాయి. దీంతో టిప్పర్‌లో ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. బాధితుడిని వెంటనే స్థానికులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ఇటీవల తరచుగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వీటికి డ్రైవర్ల అతివేగమే కారణమని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది.



## వెల్మల్ గ్రామానికి బాడీ ఫ్రీజర్ అందజేత


**అక్షరటుడు, నందిపేట్ :** వెల్మల్ గ్రామానికి బాడీ ఫ్రీజర్‌ను మంగళవారం అందజేశారు. నందిపేట మండలం కేదారీశ్వర ఆశ్రమం వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ ఆధ్వర్యంలో బాడీ ఫ్రీజర్‌ను దాతలు కస్ప రామకృష్ణ, లావణ్య, ఇసపల్లి నరేందర్ తదితరులు అందజేశారు. గ్రామానికి ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతో బాడీ ఫ్రీజర్‌ను అందజేసినట్లు దాతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీధర్, వెన్నెల శేఖర్, తల్వెద రాము, ముప్పెడ నారాయణ, గోర్ల శ్రీను, మెడికల్ మల్లేశ్, కస్ప చిన్నయ్య, రామర్తి రాజేశ్వర్, చిన్నరామాగౌడ్ పాల్గొన్నారు.

## అటవీ భూముల పరిశీలన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని వెల్లుట్ల శివారులోని హేమగిరి ప్రాంతంలో గల అటవీ భూములను ఎఫ్ఆర్‌వో చరణ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో సమావేశమై, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అటవీ భూముల పరిరక్షణ, వినియోగం, సాగు సౌకర్యాలు, తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, సహకారం, రైతులకు అవకాశాలపై వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో పృథ్వీరాజ్, బీట్ ఆఫీసర్ మౌనిక, లక్ష్మయ్య పాల్గొన్నారు. అటవీ అధికారులు రైతులతో సమావేశమై సమస్యల పరిష్కారాని చొరవ చూపడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమిపూజ



**అక్షరటుడే, బాల్కొండ:** ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో మంగళవారం గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు కావడంతో వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చంద రవి, వీడీసీ సభ్యులు భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. నూతన గ్రామపంచాయతీకి నిధులు మంజూరు కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్ రెడ్డికి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలియజేశారు. నాయకులు దేవరాజ్, లక్ష్మణ్, గంగారెడ్డి, శివశంకర్, చిన్నారెడ్డి, దేవాగౌడ్, రాజేశ్వర్, పంచాయతీరాజ్ ఏఈ షరీఫ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## స్వచ్ఛ విద్యాలయ కార్యక్రమంపై శిక్షణ

**అక్షరటుడే, ఆర్మూర్:** పాఠశాలల్లో స్వచ్ఛత కార్యక్రమాల నిర్వహణపై ఆర్మూర్ ఎంఈవో కార్యాలయంలో మంగళవారం పాఠశాలల హెచ్‌ఎంలకు, టీచర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో రాజాగంగారాం మాట్లాడుతూ పాఠశాలల్లో స్వచ్ఛత నిర్వహణ, పచ్చదనాన్ని పెంచడం, కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు నవీన్, సిరిల్ రావు, ఆర్పీ సురేందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.